వైభవంగా ఆలయాల్లో ప్రతిష్ఠ పూజలు


పూలపల్లిలో గంటాలమ్మ, దేవుళ్లమ్మ ఆలయ శిఖర ప్రతిష్ఠ పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, శశికళ దంపతులు


వాలమర్రులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న భక్తులు


మాముడూరులో వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

పూలపల్లి, వాలమర్రులో శోభిల్లిన ఆధ్యాత్మికత

పాలకొల్లు అర్బన్: మండలంలోని పూలపల్లి, వాలమర్రు గ్రామాల్లో నూతన ఆలయాల ప్రతిష్ఠతో ఆయా గ్రామాల్లో శనివారం ఆధ్యాత్మికత శోభిల్లింది. పుణ్య దంపతులు పట్టు వస్త్రాలతో అమ్మవార్లకు, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూలపల్లిలో నూతనంగా పునర్నిర్మించిన గంటాలమ్మ, దేవుళ్లమ్మ అమ్మవార్ల ఆలయ, విగ్రహ, శిఖర ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మశ్రీ మానేపల్లి సత్యనారాయణ శర్మ బ్రహ్మత్వంలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, శశికళ, దాసరి విజయ్‌కుమార్ (నాని), విజయలక్ష్మి, ఉనికెల శ్రీనివాసరావు, రామాంజలి తదితరులతో ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు. అనంతరం శేషుబాబు, శ్రీనివాసరావు దంపతులు శిఖర ప్రతిష్ఠ చేసి బూర్లు పోశారు. గ్రామ పెద్దలు మేకా కోటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు తదితరులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వాలమర్రులో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన 12 మంది దంపతులతో బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివార్ల కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన దాతలు నడింపల్లి కృష్ణంరాజు, సత్తిబాబు, శ్రీనివాసరావు, అజయ్‌వర్మ, ప్రసాదరాజు, స్థలదాతలు పెన్మెత్స రామభద్రరాజు మనవడు రవీంద్రవర్మ, విగ్రహ దాతలు ఇందుకూరి సుబ్బరాజు – సుమతి దంపతులను గ్రామ పెద్దలు సత్కరించారు. అనంతరం నవకాయ పిండి వంటలతో అన్నసంతర్పణ చేశారు.

నేత్రపర్వంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం మాముడూరులోని అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈనెల 16 నుంచి ఆలయ అర్చకులు వాడపల్లి సీతారామాచార్యులు, గోపాలకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బోగిరెడ్డి కోటేశ్వరరావు కుమారులు వీరాస్వామిజ్యోతి, గంగన్న జయలక్ష్మి దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం గరుడ విగ్రహ, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షుడు కర్రివాసురెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సర్పంచ్ గూడూరి దేవేంద్రుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వాసంశెట్టి కిరణ్, సీనియర్ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు, దాట్ల రామకృష్ణంరాజు, దాట్ల గోపాలకృష్ణంరాజు, కండిబోయిన రాంబాబు, కుక్కల పణికృష్ణ, కోసూరి రామరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సబ్‌జైల్‌లో లోక్ అదాలత్

నరసాపురం రూరల్: న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేని ముద్దాయిలకు మండల న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని జూనియర్ సివిల్‌జడ్జి వి గౌరీ శంకరరావు అన్నారు. శనివారం నరసాపురం సబ్‌జైలును ఆయన సందర్శించి అనంతరం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ముద్దాయిలను వారి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిలకు పెడుతున్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు ఉచిత న్యాయవాది గన్నాబత్తుల శివాజీచక్రవర్తి ఉన్నారు.

సీతారాములకు పంచామృతాభిషేకం



పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధిలోని రామాలయంలో స్వామివార్లకు పంచామృతాభిషేకం చేశారు. శనివారం ఉదయం ఆలయ అర్చకుడు ఆచారి స్వామివారికి అభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీఖాకొల్లు వెంకన్న, విన్నకోట శ్రీరంగనాయకులు, బదరీ, ఉప్పరి పాల్గొన్నారు.

వాచ్‌మన్ సస్పెన్షన్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సెల్‌ఫోన్ చోరీ ఘటనలో నైట్ వాచ్‌మన్ వ్యవహరించిన విధానంపై విచారణ అనంతరం పది రోజులు సస్పెండ్ చేస్తూ నోటీసు ఇచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ శనివారం తెలిపారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు తదితరులు సెల్‌ఫోన్ పోగొట్టుకున్న భక్తుడికి అందజేశారు.

అనధికార లే అవుట్లపై కఠిన చర్యలు


అంకానివారిపాలెంలో లేఅవుట్‌ను ధ్వంసం చేస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని 15వ వార్డు అంకానివారి పాలెంలో సర్వే నంబర్ 68లో వేసిన అనధికార లేఅవుట్‌ను శనివారం మున్సిపల్ అధికారులు ధ్వంసం చేశారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో ఇటీవల అనధికారికంగా లేవుట్లు వేస్తున్నారు. నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అనధికారి లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో స్పందించిన మున్సిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. జేసీబీతో అంకానివారిపాలెంలో వేసిన లేవుట్‌లో రోడ్లు ధ్వంసం చేశారు. సరిహద్దు రాళ్లరు తీసేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, టీపీవో శేషగిరి మాట్లాడుతూ మున్సిపాలిటీ అనుమతి లేకుండా లేవుట్లు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యం


పెనుగొండ ఎస్వీకేపీలో కౌన్సిల్ సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

పెనుగొండ: శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులను దీటుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. శనివారం కళాశాలలో నిర్వహించిన అటానమస్ వ్యవస్థ అకడమిక్ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులు నిష్ణాతులుగా మారేవిధంగా సిలబస్, పరీక్షలు, మూల్యాంకనం సిద్ధం చేశామన్నారు. సమావేశంలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ పి ఉమామహేశ్వరిదేవి, డాక్టర్ కే నూకరత్నం, డాక్టర్ కే దీప్తి, ఏడీఆర్ డాక్టర్ టి శ్రీనివాసరావు, ఏపీ ప్రభుత్వ ఏపీఐఐసీ చీఫ్ ఇంజనీరు ఇన్‌చార్జి వైఎస్సార్ కేవీవీ ఎల్ నరసింహరావు, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్ పాల్గొన్నారు.

నేడు ఛాంబర్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి 4 గంటల వరకూ కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, మరిన్ని ఇంటర్నేషనల్ బ్యాంకులు పాల్గొంటాయన్నారు. ఈ ఇంటర్వ్యూలో పాల్గొనే అభ్యర్థులు 2019 నుంచి 2023 (ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న) విద్యార్థులు అర్హులన్నారు. అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డ్ జెరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్ : 9701394660, 9849712739 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆలయ సేవలో భ్రమరాంబికా సేవా సమితి సభ్యులు


ఆలయంలో విగ్రహాలు శుభ్రం చేస్తున్న భ్రమరాంబికా సేవా సమితి సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: భక్తులు ఆలయ ప్రాంగణంలోని విగ్రహాలకు పూజలు చేసిన తరువాత వాటిని శుభ్రం చేయకపోవడంతో కొన్నాళ్లకు అవి శిథిలమవుతున్నాయని భ్రమరాంబికా సేవా సమితి సభ్యులు అందే బీమలింగేశ్వరరావు తెలిపారు. శనివారం ఏలూరు ప్రణవ పీఠం పీఠాదిపతి బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురూజీ ఆదేశాల మేరకు గుడి బడి సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా భీమలింగేశ్వరరావు మాట్లాడుతూ పద్మాకర్ గురూజీ ఆదేశాల ప్రకారం గుడులు, బడులు పరిశుభ్రం చేయడానికి విడతల వారీగా కొందరు సభ్యులు వెళుతుంటామని తెలిపారు. దానిలో భాగంగా స్వామివారి ఆలయానికి తొమ్మిది మంది సభ్యులు వచ్చినట్టు తెలిపారు. నేదునూరి రమేష్ కుమార్, చేబోలు రమేష్ శర్మ తదితరులు సేవలో పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం భీమవరంలో జిల్లా ఖజానా అధికారి ఎ.గణేష్‌కు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాతల జేమ్స్, ఎస్ఎస్ఎన్ రాజు, ఎస్ఎస్ఎస్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆవు, ఆంబోతు కల్యాణోత్సవం


వడలిలో కల్యాణోత్సవం సందర్భంగా తలంబ్రాలు పోస్తున్న ఆంజనేయులు, సునీత దంపతులు

పెనుగొండ: వడలిలో లోక కల్యాణార్థ ఆవు, ఆంబోతుల కల్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో కనుల పండువగా నిర్వహించారు. శనివారం వడలిలోని కాసాని వారి ఆంబోతుకు, పెనుమంట్ర మండలం మేకా వారి ఆవు పెయ్యికి కాసాని ఆంజనేయులు, సునీత దంపతులు వేద పండితులు కల్యాణోత్సవం నిర్వహించారు. తలంబ్రాలు పోసి అనంతరం ఆవు, ఆంబోతులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కల్యాణం నిర్వహించిన ఆవు పెయ్యిని ద్వారకా తిరుమల పుణ్యక్షేత్రానికి తరలించి, ఆంబోతును స్థానికంగా వదలి వేయనున్నట్టు తెలిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పథకాలు పొందేందుకు ఆధార్ తప్పనిసరి


మేడపాడు సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీవో త్రిశూలపాణి

యలమంచిలి: ప్రభుత్వ పథకాల లబ్ధిపొందాలంటే ప్రతి ఒక్కరికీ నూతన ఆధార్ కార్డు ఉండాలని ఎంపీడీవో చివటం త్రిశూలపాణి చెప్పారు. మేడపాడు గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన పిల్లలందరికీ పేరు పెట్టిన వెంటనే ఆధార్ కార్డు తీసుకోవాలని ఆయన చెప్పారు. మేడపాడు, యలమంచిలి గ్రామ సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మొదటి సారిగా వచ్చిన వారు ఆధార్ ఉచితంగా పొందాలన్నారు. 2014 ముందు ఆధార్ కార్డు తీసుకుని ఇంతవరకు అప్‌డేట్ చేయించుకోనివారు రుసుము చెల్లించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మన్నె మాధురి ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి వెండి సమర్పణ


ఆలయ చైర్మన్‌కు వెండి అందజేస్తున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చినకూరగాయల మార్కెట్ వద్ద కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామికి స్థానిక సుధ స్వీట్స్ అధినేత సోమిశెట్టి రంగ ప్రసాద్, అనంతలక్ష్మి దంపతులు 500 గ్రాముల వెండిని బహూకరించారు. శనివారం స్వామివారి సన్నిధిలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జోగి వెంకటేశ్వరరావుకు అందజేశారు. శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో ముచ్చర్ల శ్రీనివాస్, అర్చకులు కృష్ణ చైతన్య, ఉన్నమట్ల సురేష్ పాల్గొన్నారు.

నేడు ఉల్లంపర్రులో గృహ సారథుల సమావేశం

పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రు ఏఎస్ఆర్ కళాశాలలో పోడూరు మండలానికి సంబంధించిన 8 గ్రామాలకు చెందిన గృహ సారథుల సమావేశం ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు పట్టణ గృహ సారథుల కన్వీనర్ ఎంఎస్ వాసు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ విజేత కవురు శ్రీనివాస్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఉదయం 9 నుంచి 1గంట వరకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కవురు శ్రీనివాస్ కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటారన్నారు.







భారీ వర్షం... ప్రయాణికుల అవస్థ


మార్టేరు- అత్తిలి రోడ్డులో బస్‌స్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

పెనుమంట్ర: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో పెనుమంట్ర మండలంలో శనివారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. రైతులకు ఎటువంటి నష్టం కలగపోయినప్పటికీ ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మాముడూరు ధ్వజ స్తంభం ప్రతిష్ఠ సమయంలో వర్షం కురవలేదు. అన్నసమారాధన సమయంలో వర్షం కురవడంతో భక్తులు, నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారు.

వదలని వర్షం

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి వాతావరణం మేఘావృతమై ఉంది. సాయంత్రం 4గంటల సమయంలో ఒక్కసారిగా చీకటి అలముకుని భారీ వర్షం కురిసింది. పాఠశాలలకు వదిలే సమయం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి మొగల్తూరులోని ప్రధాన రహదారులతో పాటు పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి.

ఇంటర్ విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత

నరసాపురం రూరల్: పేదలు, ఆర్థికంగా, ఆరోగ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్న అడ్డాల ఇంటి పేరు కలిగిన వారిని ట్రస్ట్ ద్వారా ఆదుకుంటామని నిర్వాహకులు వాసుదేవరావు, శ్రీహరి, నాగేశ్వరరావు అన్నారు. శనివారం మొగల్తూరు మండలం ముత్యాలపల్లికి చెందిన అడ్డాల ప్రశాంతి ఇంటర్ విద్యకు అవసరమైన రూ.16,400 నగదు సహాయాన్ని చెక్కురూపంలో ఆమెకు అందజేశారు. సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది. అడ్డాల ట్రస్ట్ నిర్వాహకులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

వెండి కవచం సమర్పణ

కాళ్ల : బొండాడలోని పార్వతీ సమేత భోగేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత జనార్దన స్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన మందపాటి రామారావు, సావిత్రమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు విశ్వేశ్వరరావు, కోటేశ్వరరావు, వెంకన్న శ్రీజనార్దన స్వామివారికి రూ.12 లక్షల విలువచేసే 14.5 కిలోల వెండి సర్వాంగమును (కవచం) సమర్పించారు. దాసరి నాగేశ్వరరావు దంపతులతో పార్వతి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు బంగారు ముక్కుపుడకలు అందించారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు. భోగేశ్వరస్వామి, జనార్దనస్వామి దేవస్థానాల చైర్మన్లు నందుల నారాయణమూర్తి, మందపాటి రాము, ఈటవేగేశ్న ఆంజనేయరాజు, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

